సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 3 । ఫిబ్రవరి । 2023



'గాంధారి' జాతరకు వెళ్లొద్దాం..

బొక్కలగుట్టలోని గాంధారి ఖిల్లాలో గాంధారి మైసమ్మ జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 8లో▸



తుంపర సేద్యం.. పంటకు భాగ్యం

కెరమెరి మండలంలోని రైతులు తక్కువ నీటితో పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 'తుంపర' విధానంలో పంటలకు నీటితడులు అందిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.2/13.1

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగలు ఎండగా అనిపిస్తుంది. రాత్రి ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీలు తగ్గుతాయి. చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గురువారం జిల్లా కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వేర్వేరుగా వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గరిపెల్లి కర్నాగౌడ్, కార్యదర్శి బి.సదానందం, ఆసిఫాబాద్ యూనిట్ అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షులు సిరాజ్ ఉల్ హుక్, పుల్లయ్య, శ్యాంరావు దుర్గే, బి.వెంకటేశ్, సుభాష్‌సింగ్ పాల్గొన్నారు.

అన్నిశాఖల సమన్వయంతోనే విజయవంతం



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేందుకు అన్నిశాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్- 09 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. తప్పిపోయిన బాలల వివరాలు తెలిసినా.. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నా వెంటనే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్- 09 కార్యక్రమంలో భాగంగా 43 మంది బాల కార్మికులను గుర్తించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆపరేషన్ స్మైల్ బృందం, ఉమెన్ డెవలప్‌మెంట్, చైల్డ్ వెల్ఫేర్, లేబర్ డిపార్ట్‌మెంట్, పోలీసుశాఖతోపాటు ఇతర శాఖల అధికారులను ఎస్పీ అభినందించారు.

'6న జిల్లా బంద్'



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: పత్తి పంటకు క్వింటాల్‌కు రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న రైతు హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా బంద్‌కు పిలుపునిచ్చినట్లు వివిధ ప్రజాసంఘాల నాయకులు ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయంలో పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణపై పలు తీర్మానాలు చేశారు. అనంతరం నాయకులు రూప్‌నార్ రమేశ్, రేగుంట కేశవ్‌రావు, గోపాల్‌నాయక్, తిరుపతి, చిన్నయ్య మాట్లాడుతూ 6వ తేదీన 15 మండలాల్లో శాంతియుతంగా బంద్ పాటించాలని, రాస్తారోకోలతో నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు పలు రకాల ఉద్యమాలకు తీర్మానించినట్లు తెలిపారు. మొదటి దశలో భాగంగా 6న జిల్లా బంద్, రెండో దశలో ఎడ్ల బండ్లతో సడక్ బంద్, మూడో దశలో వారం పాటు అరిగోస నిరాహార దీక్షలు, నాలుగో దశలో రైతుల ఆవేదన- అమరణ నిరాహార దీక్షలు, ఐదో దశలో రైతుల ఆగ్రహ రైలు రోకో నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో చాపిడి సురేశ్, ప్రభాకర్, కోలె బిక్కాజీ, ప్రణయ్, మారుతి తదతరులు పాల్గొన్నారు.

భక్తిమార్గంలో నడవాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల(సిర్పూర్): ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కౌటాల మండలం తాటిపల్లి సమీపంలో వార్దా నది తీరంలో వెలసిన శ్రీసిద్ధి హనుమాన్ ఆలయంలో గురువారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, సర్పంచులు సురేశ్, మౌనిశ్, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు, సభ్యులు వానుపటేల్ పాల్గొన్నారు.



అధిక సాంద్రత విధానంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు (ఫైల్)



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఈ యువరైతు పేరు వడాయి శంకర్. రెబ్బెన మండలం గంగాపూర్‌లో వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మొదటిసారి తన ఎకరం భూమిలో అధిక సాంద్రత విధానంలో పత్తిసాగు చేపట్టాడు. మొదటి ప్రయత్నంలోనే ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి సాధించాడు. సాధారణంగా పత్తి సాగులో కేవలం 8 క్వింటాళ్లలోపే దిగుబడి సాధించిన శంకర్.. హెచ్‌డీపీఎస్ పద్ధతిలో ఏకంగా నాలుగు క్వింటాళ్లు అధికంగా దిగుబడి సాధించాడు. అయితే ఈ విధానంలో పత్తి సాగు చేసిన ప్రతీ రైతుకు ఎకరానికి రూ.4వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేస్తామని వ్యవసాయశాఖ అధికారులు చెప్పారు. ప్రస్తుతం పత్తితీత పనులు పూర్తి కాగా.. అదే స్థలంలో కూరగాయల సాగు ప్రారంభించాడు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి నగదు ప్రోత్సాహకం మాత్రం అందలేదు.

ప్రోత్సాహకం కోసం ఎదురుచూపులు

- జిల్లాలో ప్రయోగాత్మకంగా 'హెచ్‌డీపీఎస్' పత్తి సాగు
- ఎకరానికి రూ.4వేల ప్రోత్సాహకం ప్రకటించిన ప్రభుత్వం
- ఇప్పటివరకు రైతుల చేతికందని నగదు
- 500 ఎకరాలకు రూ.20 లక్షలు పెండింగ్

రెబ్బెన(ఆసిఫాబాద్): పత్తి సాగును మరింత లాభదాయకంగా మార్చేందుకు వ్యవసాయంలో రోజుకో కొత్త పద్ధతిని అన్వేషిస్తున్నారు. ఇందులో భాగంగా రైతులకు వెన్నుదన్నుగా నిలవాలనే లక్ష్యంతో వ్యవసాయశాఖ ఈ వానాకాలం సీజన్‌లో హెచ్‌డీపీఎస్(అధిక సాంద్రత విధానం) పత్తిసాగును జిల్లాలో ప్రోత్సహించింది. ఈ ఏడాది అధిక వర్షాలు కురిసినా హెచ్‌డీపీఎస్ పత్తి సాగులో ఆశించిన దానికంటే ఎక్కువగా దిగుబడి వచ్చింది. వాతావరణం అనుకూలించి ఉంటే దిగుబడి మరింత పెరిగేదని అధికారులు, రైతులు భావిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా హెచ్‌డీపీఎస్ పత్తి సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు అందజేస్తామన్న ప్రోత్సాహకం మాత్రం ఇప్పటివరకు విడుదల కాలేదు. సాగు పూర్తయినా నగదు అందకపోవడంపై అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రయోగాత్మకంగా 500 ఎకరాల్లో..

వ్యవసాయ శాఖ అధికారులు రెబ్బెన, కెరమెరి, వాంకిడి మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 500 ఎకరాల్లో ఈ పద్ధతి సాగుకు రైతులను ప్రోత్సహించారు. ఈ తరహా సాగు చేసే వారికి ఎకరాకు 3 ప్యాకెట్ల చొప్పున విత్తనాలను ఉచితంగా అందించారు. అలాగే ఎకరానికి రూ.4వేల చొప్పున నగదు అందజేస్తామని ప్రకటించారు. మొదటగా విత్తనాలు పంపిణీ చేసి, ఎప్పటికప్పుడు క్షేత్రాలను పరిశీలిస్తూ సస్యరక్షణ చర్యలు వివరించారు. ఫలితంగా ఒక్కో ఎకరానికి సుమారు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి లభించింది.

రూ.20లక్షలు పెండింగ్..

సాధారణ పత్తి సాగులో తెగుళ్లు, అధిక వర్షాలు, తర ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోతున్నారు. అధిక దిగుబడి వస్తే అన్నదాతలను నష్టాల నుంచి గట్టెక్కించవచ్చనే ఉద్దేశంతో జిల్లాలో మూడు మండలాలను ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు. అధిక సాంద్రత విధానంలో సాగు చేసిన వారికి ఎకరానికి రూ.4వేల చొప్పున నగదు అందించకుండా ఉచితంగా విత్తనాలు అందించి చేతులు దులుపుకున్నారని రైతులు మండిపడుతున్నారు. సాగు సమయంలోనే ఈ నగదు అందించాల్సి ఉంటుంది. కొంత మంది పత్తి తీత పనులు పూర్తిచేసి వేరే పంటలు కూడా వేసుకున్నారు. జిల్లాలో రైతులకు రూ.20లక్షల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. వ్యవసాయశాఖ అధికారులు రైతుల బ్యాంకు పాస్‌పుస్తకాలు, సాగు చేసిన భూములకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి అందజేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రోత్సాహక నగదు వెంటనే ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

త్వరలోనే జమవుతాయి



జిల్లాలో హెచ్‌డీపీఎస్ పద్ధతిలో పత్తి సాగు చేసిన రైతులకు నగదు ప్రోత్సాహకం నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మూడు మండలాలను ఎంపిక చేసి 500 ఎకరాల్లో సాగును ప్రోత్సహించాం. రైతులకు అందించాల్సిన రూ.4వేలు త్వరలోనే వారి ఖాతాల్లో జమవుతాయి. ఇప్పటికే బ్యాంకు ఖాతా, ఇతర వివరాలను ప్రభుత్వానికి నివేదించాం.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

మత్స్యకారులకు బీమా భరోసా

- ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద ఇన్సూరెన్స్ సదుపాయం
- సహకార సంఘాల సభ్యులకు అవకాశం
- జిల్లాలో 58 మత్స్య సహకార సంఘాలు, 3,100 మంది సభ్యులు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయం

ఆసిఫాబాద్‌అర్బన్: చేపల వేట ద్వారా ఉపాధి పొందుతున్న మత్స్యకారులు నిత్యం ప్రమాదాల మధ్య పనిచేస్తుంటారు. అలాంటి మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచి, చేపల ఉత్పత్తి పెంచేందుకు ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేస్తోంది. అర్హులైన వారికి రుణాలు సైతం మంజూరు చేస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పేరిట బీమా పథకాన్ని అమలు చేస్తోంది. దీని ద్వారా మత్స్యకారులు మృత్యువాత పడినా, శాశ్వత అంగవైకల్యం పొందినా సాయం అందజేస్తోంది. మత్స్య సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారికి గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పథకంలో ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సి అవసరం లేదు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బీమా కంపెనీలకు అర్హుల తరుపున బీమా ప్రీమియం చెల్లిస్తాయి.

18 ఏళ్లు నిండిన సభ్యులకు..

ప్రభుత్వం గుర్తించిన మత్స్యకార సంఘాల్లో 18 నుంచి 70 ఏళ్లలోపు వయస్సు ఉన్న సభ్యులందరూ పీఎంఎంఎస్‌వైకి అర్హులు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న 58 మత్స్యకార సంఘాల్లో 3,100 మంది సభ్యులుగా తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో ఇప్పటివరకు 2,100 మంది పీఎంఎంఎస్‌వై కింద తమ దరఖాస్తులు సమర్పించారు. అర్హులైన వారు ధ్రువీకరణ పత్రాలు, వివరాలతో జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆ శాఖ అధికారులు సూచిస్తున్నారు. బీమా అనంతరం ప్రమాదశాత్తు మరణిస్తే రూ.5.లక్షలు, శాశ్వత అంగవైకల్యం జరిగితే రూ.2.5లక్షలు, ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చేరితే చికిత్సకు రూ.25వేలు చెల్లిస్తారు. చేపల వేట సమయంలో నీటిలో చనిపోయినా, విద్యుత్‌శాఖ, అగ్ని ప్రమాదాలు, విష పురుగుల కాటు, ఇతర ప్రమాదాలతో మృతి చెందినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా ఈ పథకం వర్తిస్తుంది. ప్రమాదం జరిగిన తేదీ నుంచి 90 రోజుల్లో బీమా కంపెనీకి సమాచారం తెలియజేయాలి. 180 రోజుల్లోగా పరిహారం కోసం అవసరమైన వివిధ ధ్రువపత్రాలు సమర్పించాలి.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

జూలై 25 వరకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలో అర్హులైన వారు సకాలంలో దరఖాస్తులు చేసుకోవాలి. మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారు నామినీకి సంబంధించిన ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. గైడ్‌లైన్ ప్రకారం వివరాలు నమోదు చేసి, దరఖాస్తులను జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ కార్యాలయంలో అందజేయాలి. వచ్చిన దరఖాస్తులను ఎన్‌ఎఫ్‌డీబీలో నమోదు చేస్తాం.

– సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి

న్యాయవాదులు నిత్య విద్యార్థులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ

ఆసిఫాబాద్: న్యాయవాదులు నిత్య విద్యార్థులని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్‌లో జూనియర్ న్యాయవాది సభ్యత్వం తీసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. న్యాయవాద వృత్తిలో కొనసాగినన్ని రోజులు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సి ఉంటుందన్నారు. వృత్తిలో ఎదగాలంటే నిబద్ధతతో పని చేయాలని సూచించారు. న్యాయవాదులు సమాజానికి దిశానిర్దేశం చూపేలా పనిచేయాలన్నారు. జూనియర్ న్యాయవాది కొంక సురేశ్ బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకున్నారు. సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్, జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు, న్యాయవాదులు తాటిపెల్లి సురేశ్, ముక్త సురేశ్, ప్రకాశ్‌చంద్ జైన్, దీపక్‌రావు, వెంకటేశ్వర్లు, రజిహైదర్, జగన్మోహన్ రావు, రవీందర్, రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ విద్య



వడ్డెరవాడ పాఠశాలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- 'మన ఊరు– మన బడి' పాఠశాలలు ప్రారంభం

వాంకిడి(ఆసిఫాబాద్): కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా నూతనంగా తీర్చిదిద్దిన వాంకిడి మండలం వడ్డెరవాడలోని ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ తల్లిదండ్రులను పిల్లలను ప్రైవేటుకు పంపించకుండా సర్కారు బడుల్లో చేర్పించాలని సూచించారు. వడ్డెరవాడ పాఠశాలలో రూ.9.45 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మండలంలో 23 పాఠశాలలు ఎంపిక చేయగా, ఇప్పటివరకు నాలుగు చోట్ల పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు.

విద్యార్థులతో సరదా ముచ్చట్లు..

పాఠశాల సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్, అదనపు కలెక్టర్ కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. భవిష్యత్తులో ఏమవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. బడిని దేవాలయంగా భావించి ప్రతిరోజూ రావాలని సూచించారు. ఇతర పనులకు వెళ్లకుండా చదువుకోవాలన్నారు. విద్యార్థులు చురుకుగా స్పందించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఎంపీపీ విమలబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, ఎంఈవో మనుకుమార్, సర్పంచ్ మారుతి తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రిక్షాకాలనీలో 'మన ఊరు– మన బడి' కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రూ.కోట్ల ఖర్చుతో ప్రభుత్వ పాఠశాలలను గొప్పగా తీర్చిదిద్దుతుందన్నారు. అనంతరం పాఠశాలలో వసతులను పరిశీలించారు. రిక్షాకాలనీలో మురుగు కాలువ నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కోరగా, సత్వరమే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఎంఈవో భిక్షపతి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కాగజ్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు

ఆసిఫాబాద్‌రూరల్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆసిఫాబాద్ మండలంలోని అడ పీహెచ్‌సీ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల్లో ఆశవర్కర్ల సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు, ఉద్యోగ భద్రత, ప్రసూతి సెలవులు కల్పించడంతోపాటు పనిభారం తగ్గించాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్, ఆశవర్కర్లు రమ, శోభ, లలిత పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: శీతాకాల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశ వర్కర్ల సమస్యలను చర్చించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశ కార్యకర్తలతో గురువారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఆశకార్యకర్తలు పేదలకు సేవలందిస్తున్నారని తెలిపారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ వైద్యం.. ప్రైవేటు పరీక్షలు

- మంచిర్యాల ఆస్పత్రిలో సిబ్బంది కొరత
- రక్త, మూత్ర పరీక్షలు బయటనే..!
- ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీ



ల్యాబ్ టెక్నీషియన్ గదిలో పరికరాలు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ ఉద్యోగి ఒకరు జ్వరంతో బాధపడుతూ మంచిర్యాల ఆర్టీసీ వైద్యశాలకు వచ్చాడు. మూడు రోజులుగా జ్వరం తగ్గకపోవడంతో రక్త, మూత్ర పరీక్షలు అవసరమయ్యాయి. ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రి లేదా ప్రైవేటు ల్యాబ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజుల తరబడిగా ఇదే తంతు కొనసాగుతోంది. వందలాది మంది ఉద్యోగులతోపాటు విశ్రాంత సిబ్బందికి సేవలు అందిస్తున్న మంచిర్యాల ఆర్టీసీ వైద్యశాలను సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఈ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులందరూ తాత్కాలికమే. కాంట్రాక్టు వైద్యుడితోపాటు స్టాఫ్‌నర్సు, వార్డుబాయ్‌లతో నెట్టుకొస్తున్నారు. సీజనల్ వ్యాధులు జ్వరం, జలుబు, గొంతునొప్పి తదితర రోగాలతో బాధపడుతున్న వారి సంఖ్య అధికంగా ఉంది. ప్రతీ నెల 10న తార్నాక నుంచి మందులు వచ్చే క్రమంలో 80 నుంచి 90మంది ఆస్పత్రికి వచ్చి వెళ్తుంటారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ డిపో ఉద్యోగులకు ఒక్కరే వైద్యులు ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు వెనుదిరుగుతున్నారు. వ్యయప్రయాసలు పడి ఇక్కడికి వస్తే సిబ్బంది లేరనే సమాధానంతో నిరాశకు లోనవుతున్నారు.

రెండు జిల్లాల కార్మికులకు ఇక్కడే ..

మంచిర్యాల, కుమురంభీం జిల్లాల ఆర్టీసీ కార్మికులు, కుటుంబసభ్యులతోపాటు రిటైర్డ్ ఉద్యోగులు ఈ ఆస్పత్రిని ఆశ్రయిస్తుంటారు. మంచిర్యాల డిపోకు చెందిన 557పైగా మంది, ఆసిఫాబాద్ డిపోకు చెందిన 325 మందితోపాటు రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వైద్య సేవలు పొందుతున్నారు.

సిబ్బంది లేక ఇబ్బందులు

ఆస్పత్రిలో వైద్యుడు, ఫార్మాసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్, రికార్డు అసిస్టెంటు, స్టాఫ్‌నర్సు, స్వీపరు ఉండాల్సి ఉండగా.. కాంట్రాక్టు వైద్యుడితోపాటు స్టాఫ్‌నర్సు, వార్డుబాయ్ మాత్రమే ఉన్నారు. ఫార్మాసిస్టు లేకపోవడంతో స్టాఫ్‌నర్సు వైద్యసేవలతోపాటు మందులు ఇవ్వాల్సి వస్తోంది. 10వ తేదీ తర్వాత రక్తపోటు, మధుమేహం, గుండెకు సంబంధించిన వ్యాధిగ్రస్తులు మందుల కోసం 90మంది, నిత్యం 20మందికి పైగా రోగులు వస్తుంటారు. తీవ్రమైన అనారోగ్యానికి సెలవు మంజూరు కావాలంటే వైద్యుడు ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఒకే వైద్యుడు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళా వైద్యురాలు లేకపోవడంతో మహిళా ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు.

తడిసి మోపెడు

రక్త, మూత్ర పరీక్షలు చేయడానికి ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో బయట(ప్రైవేట్)కు వెళ్లాల్సి వస్తోంది. వందలాది రూపాయలు వ్యయం చేసి పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇది అదనపు ఆర్థిక భారమేనని కార్మికులు వాపోతున్నారు. ఇంకోవైపు వార్డుబాయ్ కట్లు కట్టడం నుంచి కంప్యూటర్ పనులకు వరకు చేస్తుంటారు. ఓపీ చీటిలు రాయడం.. సిస్టమ్ ఆపరేటర్, ఒక్కోసారి స్టాఫ్‌నర్సు రాకపోతే ఇంజక్షన్‌లు వేయాల్సిన పరిస్థితి. మహిళా వైద్యురాలితోపాటు అవసరమైన సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

సిబ్బంది కొరతపై నివేదించాం

ఆర్టీసీ వైద్యశాలలో సిబ్బంది కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, స్వీపరు నియామకానికి సంబంధించిన పూర్తి వివరాలు అందించాం. ఉన్న సిబ్బందితో అవసరమైన పనులు చక్కదిద్దుతున్నాం.

– పరంజ్యోతి, మెడికల్ ఆఫీసర్

వణికిస్తున్న చలిగాలులు

- జిల్లా వ్యాప్తంగా మళ్లీ పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు
- గురువారం సిర్పూర్(యూ)లో 9.6 డిగ్రీలుగా నమోదు



కౌటాల(సిర్పూర్): వాతావరణంలో మార్పులతో జిల్లాలో చలిగాలులు వీస్తున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడంతో జిల్లా వాసులు అవస్థలు పడుతున్నారు. ఫిబ్రవరిలో ఎప్పుడూ లేనంతగా చలి పంజా విసురుతోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వృద్ధులు, చిన్నారులు శీతల గాలులతో అల్లాడుతున్నారు.

9.6 డిగ్రీలుగా నమోదు..

జనవరిలో పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎండగా ఉంటుంది. కానీ జనవరి 29 నుంచి రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఈ నెల 1న జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 9.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇక గురువారం సిర్పూర్(యూ)లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 9.6 డిగ్రీలు నమోదు కాగా, కెరమెరిలో 12.6, తిర్యాణిలో 13, వాంకిడిలో 14.3 డిగ్రీలుగా నమోదైంది. మూడు రోజులుగా వాతావరణంలో మార్పుల ఫలితంగా శీతల గాలులు వీస్తున్నాయి. ఫిబ్రవరిలో పది డిగ్రీల లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే మొదటిసారని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవడం, నీటి వనరులు నిండుగా ఉండటంతోనే చలి అధికంగా ఉందని వారు చెబుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం..

ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, రెబ్బెన వంటి ప్రాంతాలతో పోల్చితే ఏజెన్సీ మండలాలు, మారుమూల గ్రామాల్లోనే చలి తీవ్రత అధికంగా ఉంటుంది. చుట్టూ అటవీప్రాంతాలు ఉండటం, యాసంగి సాగుతో పొలాల్లో నీళ్లు ఉండటం కూడా ఉష్ణోగ్రతలు పడిపోవడానికి కారణాలుగా నిలుస్తున్నాయి. పగటి పూట 30 డిగ్రీలపైనే పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో వారం పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

రాపన్‌పల్లిలో పులి పాదముద్రలు



రాపన్‌పల్లి అటవీప్రాంతంలో పులిపాదముద్రలు

కోటపల్లి: మండలంలోని రాపన్‌పల్లి గ్రామంలో జాతరలో భాగంగా అడవి ప్రాంతం నుంచి సమ్మక్కను తీసుకువచ్చే క్రమంలో గ్రామస్తులకు రాపన్‌పల్లి సమీపంలో పులి కనిపించింది. దీంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అమ్మవారి వాహనం పులి కాగా కావడంతో అమ్మవారే వచ్చివెళ్లారని విశ్వసిస్తున్నారు. ఇది ఇలా ఉండగా గ్రామంలో పులి కదలికలతో సమీప గ్రామాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పులి అడుగులు కనిపించడంతో స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించామని స్థానికులు తెలిపారు.

లైన్‌మెన్‌కు గాయాలు

లక్సెట్టిపేట: విద్యుత్ స్తంభంపై నుంచి కింద పడి లైన్‌మెన్‌కు గాయాలైన సంఘటన పట్టణంలోని అంగడీబజార్‌లో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గురువారం ఉదయం విద్యుత్ మరమ్మతుల నిమిత్తం స్తంభం ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి లైన్‌మెన్ సందీప్ కిందపడ్డాడు. గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్సులో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై విద్యుత్ ఏఈ మల్లేష్‌ను వివరణ కోరగా కాలుకు, చేతికి గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామని చెప్పారు.

తొమ్మిది మందిపై పిచ్చికుక్కల దాడి

భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామానికి చెందిన 9మందిపై గురువారం పిచ్చికుక్కలు దాడిచేసి గాయపరిచాయి. గ్రామంలోని కొత్తగూడెం ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. అదేవిధంగా రెండు పశువులను సైతం గాయపరిచాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని పిచ్చికుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తల్లీకుమారుడు అదృశ్యం

కాసిపేట: మండలంలోని చిన్న ధర్మారం గ్రామానికి చెందిన షేక్ సాసిన్‌బేగం, షేక్ షాయన్ అదృశ్యమయ్యారు. కాసిపేట ఎస్సై గంగారాం తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ షారుఖ్‌బాబా భార్య నౌసిన్‌బేగం, కుమారుడు షేక్ షాయన్(2) బుధవారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పుట్టింటికి వెళ్తానని భర్త వద్ద రూ.150 తీసుకొని వెళ్లింది. పుట్టింటికి చేరకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

రేపు అండర్-15 ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఉదయం ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్స్ అండర్-15 బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. నారాయణరెడ్డి తెలిపారు. క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన జిల్లా జట్లు ఈ నెల 11, 12వ తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. గోలేటి షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లును 98666 52249 నంబరులో సంప్రదించాలని కోరారు.

'గాంధారి' జాతరకు వెళ్లొద్దాం



సదర్ భీమన్న వద్ద కొలువు దీరిన దేవతామూర్తులు



గాంధారి ఖిల్లా ముఖద్వారం

- మైసమ్మ జాతరకు సర్వం సిద్ధం
- మూడు రోజుల పాటు సాగనున్న ఉత్సవాలు
- భక్తుల కోసం భారీగా ఏర్పాట్లు

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లాలో మూడు రోజులపాటు సాగే గాంధారి మైసమ్మ జాతర శుక్రవారం ప్రారంభంకానుంది. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ జాతరలో ఆదివాసీ నాయక్‌పోడ్‌లతో పాటు చుట్టుప్రక్కల జిల్లాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఉత్సవాలకు ప్రభుత్వ అధికారులు, ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీ సంవత్సరం మాఘశుద్ధ దేవర్లపున్నంకు పంటలు బాగా పండాలని, వర్షాలు కురువాలని నాయక్‌పోడ్‌లు మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించటం, పూజలు చేయటం ఆనవాయితీగా వస్తోంది.



ఖిల్లాలోని కాలబైరవుని విగ్రహం

చరిత్ర గల ఖిల్లా ఇది...

జిల్లా కేంద్రం నుంచి సరిగ్గా 8 కిలోమీటర్ల దూరంలో మంచిర్యాల–నాగ్‌పూర్ హైవే ప్రక్కనే బొక్కలగుట్ట గ్రామం ఉంది. ఈ గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో గాంధారి ఖిల్లా ఉంటుంది. ఎన్నో వేల ఏళ్ల చరిత్ర గల ఖిల్లాగా చెప్పుకునే గాంధారి ఖిల్లా ప్రారంభంలో పెద్ద ద్వారం, పైకి వెళ్తుంటే బైరవ విగ్రహం దర్శనమిస్తుంది. అనంతరం మెట్ల ద్వారం గుండా పైకి వెళ్తే మైసమ్మ తల్లి విగ్రహం ప్రత్యక్షమవుతోంది. ఖిల్లాలో ఏడు తలల నాగదేవత విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఖిల్లా ప్రాంగణంలో రెడ్డిరాజుల శిలశాసనం, వీరాంజనేయస్వామి విగ్రహం, గుర్రాల కొలను, ఏనుగుల బావి తదితర మరికొన్ని ఖిల్లా ప్రత్యేకతలుగా చెప్పవచ్చు.

జాతరకు అన్ని ఏర్పాట్లు..

జాతరను ప్రభుత్వం కొంతకాలంగా అధికారికంగా నిర్వహిస్తోంది. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలోనే భక్తులు తరలిరానున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం రూ. 2కోట్ల 10 లక్షలతో ప్రత్యేకంగా బీటీ రోడ్డు నిర్మించారు. బొక్కలగుట్ట గ్రామం నుంచి ఖిల్లా వరకు సుమారు మూడు కిలో మీటర్ల మేర రోడ్డు పనులు పూర్తిచేశారు. తాగునీటి నల్లాలు, మరుగుదొడ్లు నిర్మించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం వేదికలను ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్, గ్రామపంచాయతీ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సదర్‌భీమన్న నుండి జాతర షురూ...

మూడు రోజుల పాటు నిర్వహించనున్న గాంధారి మైసమ్మ జాతరలో భాగంగా మొదటి రో జు సదర్‌భీమన్న నుంచి జాతర ప్రారంభంకా నుంది. ఇక్కడ దేవతామూర్తులను ప్రతిష్ఠించనున్నారు. తప్పెటగూళ్లు, పిల్లనగ్రోవి ఆటపాటలతో కాలినడకన గిరిజనులు దేవతామూర్తుల ప్రతిమలతో గోదావరి నదికి వెళ్తారు. నది జలాలతో శుద్ధి చేసిన అనంతరం పూజలు నిర్వహించి అదే రోజు రాత్రి గోదావరి జలాలతో తిరుగు ప్రయాణమై సదర్‌భీమన్న వద్ద రా త్రి బస చేస్తారు. మరుసటి రోజు ఉదయం గ్రామదేవతకు పూజ, భీమన్న దేవుడికి పట్నా లు వేస్తారు. శనివారం సాయంత్రం దేవతా మూర్తులకు అభిషేకాలు చేసి జాతర జరిగే ఖి ల్లా దిగువ ప్రాంతానికి చేరుకుంటారు. రాత్రి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారుల చే తప్పెటగూళ్ళ, లక్ష్మీదేవర నృత్యాలతో పాటు సంప్రదాయ పద్ధతిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇక చివరిరోజు ఆదివారం తెల్లవారుజామున మైసమ్మ తల్లికి పెద్దపూజ నిర్వహించిన అనంతరం దర్బార్ నిర్వహిస్తారు.



నాగదేవత విగ్రహం

భళా.. మహేంద్రుడి హస్తకళ



పుచ్చకాయపై ఆంజనేయుడు



తెలంగాణ తల్లి విగ్రహాన్ని తీర్చిదిద్దుతున్న మహేందర్

- వినూత్న విగ్రహాల తయారీలో జిల్లా యువకుడు
- సిమెంట్, గ్రానైట్‌తో ఆకట్టుకునేలా రూపాలు

జైపూర్(చెన్నూర్): జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన మహేందర్ హస్తకళలో రాణిస్తున్నాడు. చిలకాని లక్ష్మి, వెంకటి దంపతుల కుమారుడైన మహేందర్ హస్తకళా నైపుణ్యంతో అందర్నీ అబ్బురపరుస్తున్నాడు. చిన్నతనంలో టీవీలో వచ్చిన ఓ కార్యక్రమంలో చాక్‌పీస్ ముక్కలతో వివిధ ఆకృతులు తయారు చేయడం చూశాడు. అప్పటి నుంచి చిన్నచిన్న కళాకృతులను తయారు చేయడం ప్రారంభించాడు. అంచెలంచెలుగా ఎదిగి నేడు మేధావులు, దేవుళ్ల విగ్రహాలు, జీవుల ఆకృతులు, అందాలు ప్రతిబింబించే మరెన్నో కళాకృతులు తయారు చేస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు. మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో గల ప్రాణహిత అతిథిగృహంలో చూపరులను ఆకర్షించేలా నెమలి బొమ్మలను చెక్కాడు. అంబేద్కర్, మహాత్మా గాంధీ, తెలంగాణ తల్లి, వినాయకుడు, శివుడు, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయుడు, ఏనుగు విగ్రహాలు చెక్కాడు. వేలాల గట్టు మల్లన్న స్వామి సన్నిధికి వెళ్లే రోడ్డులో ఆర్చీ, వినాయకచవితిని పురస్కరించుకుని కుందారంలోని రెండెకరాల వ్యవసాయ భూమిలో 190 ఫీట్ల పొడవు, 160 ఫీట్ల వెడల్పుతో ప్రకృతి దిగివచ్చినట్లుగా గణపయ్యను దించాడు. ఇలా తయారు చేసిన కళాకృతులు ఆకట్టుకుంటున్నాయి.



ప్రకృతి ఒడిలో కొలువుదీరిన గణపయ్య

పోరాటాలకు సిద్ధం కావాలి

- సింగరేణిని ప్రైవేటీకరించేందుకు కుట్ర
- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థను ప్రైవేటీకరించడానికి కుట్ర జరుగుతోందని, పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం ఏరియాలోని కేకే-5 గని ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణ పెరిగిపోయిందని తెలిపారు. గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. 11వ వేజ్ బోర్డులో ఉద్యోగులకు మెరుగైన ఒప్పందం జరిగిందని, అవగాహన లేని టీబీజీకేఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉద్యోగులకు ఏప్రిల్ నుంచి కొత్త వేతనాలు చెల్లించడం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో యూనియన్ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్ తిరుపతి, శ్రీనివాస్, రాజేశం తదితరులు ఉన్నారు.

గుస్సాడీ బృందానికి పీవో అభినందన



గుస్సాడీ బృందం సభ్యులతో పీవో వరుణ్‌రెడ్డి

నార్నూర్(జైనూర్): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఢిల్లీలో ప్రదర్శన ఇచ్చి వచ్చిన పద్మశ్రీ గుస్సాడీ కనకరాజు బృందాన్ని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి గురువారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర స్థాయి నుంచి సౌత్‌జోన్, నార్త్ జోన్ కళా ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గుస్సాడీ కళాకారులు పీవోను కలిసి గుస్సాడీ టోపి బహూకరించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు బయటి ప్రపంచానికి పరిచయం చేయడానికి సహాయ సహకారాలు అందించిన పీవో బదిలీ బాధాకరమని అన్నారు. విద్యాభివృద్ధి కోసం అక్షరజ్యోతి వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఆశ్రమ పాఠశాలల్లో అమలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గుస్సాడీ టీం లీడర్ కనక సుదర్శన్, సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వరావు, ఉప సర్పంచ్ సావిత్ర ధర్మేందర్, గ్రామం పటేల్ మాణిక్‌రావు, మాజీ సర్పంచ్ కనక కొద్దు, హైమన్ డార్ఫ్ యూత్ గుస్సాడీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వాంకిడి: బైక్‌తో ఎడ్లబండిని ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన మండలంలో హైదరాబాద్–నాగ్‌పూర్ జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సాగర్, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని ఏర్‌గాం గ్రామానికి చెందిన ఆత్రం కన్నయ్య (42) బుధవారం రెబ్బెన మండల పరిధిలోని నార్లపూర్ గ్రామంలోని బంధువుల ఇంట్లో ఓ శుభకార్యానికి వెళ్లాడు. గురువారం తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వచ్చే క్రమంలో బంబార గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన ఎడ్ల బండిని ఢీకొనగా అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

న్యూమోకోనియోసిస్ వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న కౌశిక సర్కార్

శ్రీరాంపూర్: బొగ్గు గనుల్లో పనిచేసే ఉద్యోగులకు దుమ్ము, ధూళితో ఊపిరితిత్తులకు వచ్చే న్యూమోకోనియోసిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీఎంఎస్), మెడికల్ డాక్టర్ కౌశిక్ సర్కార్ తెలిపారు. గురువారం సీసీసీలోని సింగరేణి గెస్టు హౌజ్‌లో ఈ వ్యాధిపై జోనల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధులను ముందుగా గుర్తిస్తే వైద్యం తీసుకోవచ్చన్నారు. ఉద్యోగుల ఆరోగ్యంగా ఉండడానికి ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మరో డీఎంఎస్(మెడికల్) డాక్టర్ జాన్‌జార్జ్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి. సంజీవరెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్‌రావు, ఏరియా డీవైసీఎంఓలు రమేశ్‌బాబు, కిరణ్‌రాజ్‌కుమార్, ఉషా, వైద్యులు పద్మజ, శౌరీ పాల్గొన్నారు.

యాజమాన్యం మొండి వైఖరి వీడాలి



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా కార్మికుల సమస్యలపై సింగరేణి యాజమాన్యం అనుసరిస్తున్న మొండి వైఖరిపై పోరాటాలు చేయాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బ్రాంచీ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ పోస్టులు వారి విధులలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. గోలేటి డిస్పెన్సరీ, బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఏరియాలో కార్మికుల కొరత మూలంగా పనిచేస్తున్న కార్మికులపై తీవ్ర పనిభారం పడుతోందని వివరించారు. కార్మికుల కొరతను తీర్చాలని పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పెడచెవిన పెడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. కార్మికుల సమస్యలు తీర్చాలని కోరారు. నాయకులు ప్రకాష్‌రావు, మంగీలాల్, వెంకటేశ్వర్లు, సదాశివ్, సంపత్, వీరస్వామి, రమేష్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో దొంగతనం

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు సమీపంలోని పంచముఖి హనుమాన్ టెంపుల్‌లో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై చంద్రకుమార్ వివరాల ప్రకారం... పూజారి బుధవారం సాయంత్రం ఆలయం బంద్ చేసి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సుమారు లక్షా 40వేల విలువైన ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. అలాగే పట్టణంలోని మొదటి జోన్‌లోని రాజబాబు అనే సింగరేణి కార్మికుడి ఇంట్లోని బీరువాలో 12తులాల బంగారు ఆభరణాలు సైతం చోరీకి గురి కాగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కార్మికులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్ నుంచి మంచిర్యాల వరకు సింగరేణి కార్మికులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. గురువారం ఏరియా జీఎం దేవేందర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, కన్వేయన్స్ డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులు, ఇతర విభాగాల్లో పని చేసే కార్మికులకు సరైన సమయంలో రవాణా సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మంచిర్యాల నుండి గోలేటికి, తిరిగి గోలేటి నుండి మంచిర్యాలకు నడిచిన ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కొన్ని రోజుల నుండి నిలిపివేశారని అన్నారు. దీంతో ఏరియాలో పని చేసే వివిధ ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు విధులకు హాజరయ్యేందుకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పూదరి సాయికిరణ్, కన్వేయన్స్ డ్రైవర్లు సంతోష్, శ్రీనివాస్, అశోక్, దిలీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యువ జోరు.. పరుగులు హోరు..







సీనియర్స్ విభాగంలో ఫైనల్‌కు చేరిన వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు, హోరాహోరీగా తలపడుతున్న జట్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీటీసీ చంద్రశేఖర్ గౌడ్

- ఎస్‌పీఎల్ సీజన్-4లో తొలి అర్ధసెంచరీ నమోదు
- రెండో రోజు పోటీలను ప్రారంభించిన డీటీసీ చంద్రశేఖర్ గౌడ్
- సీనియర్స్ ఫైనల్‌లో వాగ్దేవి కళాశాల, మంచిర్యాల

కరీంనగర్‌స్పోర్ట్స్: అసలు క్రికెట్ పోరు అంటే ఇదేనేమో.. ఓ వైపు సిక్సర్‌ల మోత.. మరోవైపు బౌండరీల బాదుడు.. ఇలా మైదానం మొత్తం పరుగుల వరదను పారిస్తుంటే ప్రేక్షకులు, తోటి క్రీడాకారుల కేకలు, ఈలల మధ్య 'సాక్షి' ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా, హోరాహోరీగా సాగాయి. ఈ సీజన్‌లో తొ లి అర్ధ సెంచరీని వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన నిఖిల్ సాయి నమోదు చేశాడు. నేడు సీనియర్స్ సెమీఫైనల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్..

క్రీడలతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, క్రీడల్లో రాణించినట్లే విద్యలోనూ రాణించాలని ఉమ్మడి జిల్లా రవాణా శాఖ అధికారి మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. ఎస్‌పీఎల్ రెండో రోజు పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కాసేపు క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, కరీంనగర్ బ్యూరో చీఫ్ బాషబోయిన అనిల్ కుమార్, సాక్షి సిబ్బంది సిలివేరి మహేందర్, రాకేష్, పరుషరాం, జ్యోతిష్మతి కళాశాల పీడీ వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ విశ్వప్రకాశ్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.



అర్ధసెంచరీ నమోదు చేసిన నిఖిల్ సాయి

తొలి అర్ధసెంచరీ నమోదు

వాగ్దేవి డిగ్రీ కళాశాలకు చెందిన నిఖిల్ సాయి ట్రినిటీ కళాశాలతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కేవలం 24 బంతుల్లో 4 సిక్స్‌లు, 6 ఫోర్లతో 51 పరుగులు చేసి అర్ధసెంచరీని నమోదు చేశాడు. అదే కళాశాలకు చెందిన సాయి కృష్ణారెడ్డి 21 బంతుల్లో 3 సిక్స్‌లు, 6 ఫోర్లతో 46 పరుగులు చేయగా.. సెమీస్‌లో 18 బంతుల్లో ఒక సిక్స్, 4 ఫోర్లతో 34 పరుగులు చేశారు. అశ్వక్ 3 వికెట్లు, శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన నౌమాన్ 10 బంతుల్లో 3 సిక్స్‌లు, ఒక ఫోర్‌తో 25 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీశాడు.

రెండో రోజు ఫలితాలు

- జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్, ఎస్సారార్ కళాశాల కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఎస్సారార్ కళాశాల 51 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌లో ప్రవేశించింది. జట్టులో అల్ఫీ, నవీన్ రాణించారు
- జేఎన్‌టీయూ మంథని, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీ చైతన్య జట్టు 32 పరుగుల తేడాతో విజయాన్ని నమోదు చేసుకుంది. జట్టులో నౌమాన్, అరవింద్ రాణించారు.
- వాగ్దేవి డిగ్రీ కళాశాల మంచిర్యాల, ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల పెద్దపల్లి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వాగ్దేవి జట్టు 70 పరుగులు భారీ విజయాన్ని నమోదు చేసింది. జట్టులో నిఖిల్ సాయి, సాయికృష్ణారెడ్డి రాణించారు.
- వాగ్దేవి డిగ్రీ కళాశాల మంచిర్యాల, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాల తిమ్మాపూర్ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసి సీనియర్స్ విభాగంలో ఫైనల్‌లో ప్రవేశించింది.